ఐఐఐటీ నుంచి ఇంటర్న్‌షిప్

సిటీబ్యూరో, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణ స్థానిక భాషలను డిజిటల్ ప్రపంచంలో నిలిపేందుకు ఇండిక్ విక్ ప్రాజెక్ట్ ద్వారా హైదరాబాద్ ఐఐఐటీ ఓ ప్రత్యేక ఇంటర్న్‌షిప్‌ను అందించనుంది. ఇంటర్న్‌షిప్ చేయాలనే ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నది. ప్రధానంగా వెనుకబడిన తెగలకు చెందిన భాషల డిజిటల్ పరిరక్షణ, అభివృద్ధి, వికీపీడియా వంటి వాటికి కంటెంట్‌ను తయారు చేయడానికి ఇంటర్న్‌షిప్ ద్వారా అవకాశం కల్పించనున్నది. ఈ ఇంటర్న్‌షిప్‌లో గోండి, కోయ, కోలామి, నాయక్డి, చెంచు, కైకాడి (ఎరుకల), లంబాడా, నక్కల, కొండ కమ్మర వంటి భాషల డిజిటల్ కంటెంట్‌ను రూపొందించాల్సి ఉంటుంది. ఇంటర్న్‌షిప్ చేసేవారు వికీపీడియా, వికీపీడియా కామన్స్, వికీడేటా, వీక్షనరీ వంటి వేదికల నిర్వహణలో పాలుపంచుకునే అవకాశం లభిస్తుంది. ఈ ఇంటర్న్‌షిప్ మే 12 నుంచి జూన్ 30 వరకు ఉంటుంది. దరఖాస్తులు చేసుకోవడానికి ఈనెల 30 చివరి తేదీ. ప్రస్తుతం డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సంబంధింత భాషల్లో రాయడం, మాట్లాడటం తప్పనిసరి. ఇంటర్నెట్‌పై అవగాహన కలిగి ఉండాలి. దరఖాస్తును ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలి. మరిన్ని వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

డ్రగ్స్ దందాలో హవాలా..!

15 మంది యువతుల ఖాతాల్లోకి నగదు బదిలీ

నైజీరియాకు హవాలా మార్గాల ద్వారా తరలింపు

మనీల్యాండరింగ్ గుట్టురట్టు చేసిన టీజీ న్యాబ్ విభాగం

ముగ్గురి అరెస్ట్, మరో 9మంది కోసం గాలింపు

డ్రగ్‌పెడ్లర్ల అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న టిజిన్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య

సిటీబ్యూరో, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): డ్రగ్స్ దందాలో హవాలా కోణం వెలుగుచూసింది. హైదరాబాద్ కేంద్రంగా డ్రగ్స్ సప్లై చేస్తున్న ముగ్గురు నైజీరియన్లను నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారులు అరెస్ట్ చేశారు. వారి నుంచి భారీ మొత్తంలో మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ విక్రయించి సంపాదించిన డబ్బులను హవాలా మార్గంలో విదేశాలకు పంపుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు శనివారం బంజారాహిల్స్‌లోని భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ దందాకు సంబంధించిన వివరాలు టిజి న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య వెల్లడించారు. గత ఐదేళ్లుగా డ్రగ్స్ ద్వారా నైజీరియాకు వెళ్లిన డబ్బుల వివరాలు సేకరించామని, డ్రగ్స్ కావాలని కస్టమర్లు డబ్బులు చెల్లించే లావాదేవీల ద్వారా నిందితులను పట్టుకున్నామని ఆయన చెప్పారు. అమెరికాలో డ్రగ్స్ కావాలనుకునే వారు 15 మంది యువతుల ఖాతాల్లోకి డబ్బులు జమచేస్తారని, నైజీరియన్లు వారికి వివిధ మార్గాల ద్వారా డ్రగ్స్ పంపుతున్నారని ఆయన తెలిపారు. అమెరికా నుంచి డబ్బులు నేరుగా నైజీరియాకు వెళ్లకుండా మొదట భారత్‌కు పంపిస్తారని, ఇక్కడి యువతుల అకౌంట్లలో జమ అయిన మొత్తాన్ని డ్రగ్స్ పెడ్లర్లు హవాలా మార్గాల ద్వారా నైజీరియాకు తరలించుకుపోతున్నారని ఆయన తెలిపారు. టోలీచౌకి ప్రాంతానికి చెందిన ఒక యువతిని అరెస్ట్ చేసి విచారించినప్పుడు ఈ విషయాలు వెలుగుచూశాయని, ముఠా సభ్యులు ఈ యువతికి రూ.50వేలు ఇచ్చినట్లు సందీప్ శాండిల్య తెలిపారు. ఆమె బ్యాంకు లావాదేవీలపై అనుమానం వచ్చి మూడునెలల పాటు నిఘా వేసినట్లు చెప్పారు. ఈ కేసులో ఇద్దరు నైజీరియన్లు ఉగ్వు చెక్వు అలియాస్ జాన్‌కోల్, చుక్వుఒగ్బొన్న అలియాస్ బిగ్‌జో, హైదరాబాద్ మలక్‌పేట్‌కు చెందిన మాటిన్‌సిద్ధిఖిలను తెలంగాణ యాంటీనార్కోటిక్స్ బ్యూరో పోలీసులు అరెస్ట్ చేయగా మరో 9మంది కోసం గాలిస్తున్నారు. ప్రధాన నిందితుడు నైజీరియాకు చెందిన ఎబుకా టూరిస్ట్ వీసా మీద హైదరాబాద్‌లో ఉంటూ తన తమ్ముడు ఫ్రాంక్లిన్ సహాయంతో గ్లోబల్ డ్రగ్ నెట్ వర్క్ నిర్వహించాడని, కొకైన్, ఎండీఎంఏ వంటి డ్రగ్స్‌ను హైదరాబాద్, బెంగళూరులతో పాటు యూఎస్‌కు కూడా పంపేవారని తెలిపారు. ఎబుక సూచనల మేరకు ఎమ్మా అమెరికన్ యువతులను ట్రాప్ చేసి వారి అకౌంట్లు, క్రెడిట్‌కార్డ్ నంబర్లను తీసుకుని డ్రగ్స్ కావాలనే కస్టమర్లకు ఇచ్చేవారని సందీప్‌శాండిల్య తెలిపారు. నిందితులు డార్క్ వెబ్, ఫారెక్స్ మనీ ఏజెంట్ల ద్వారా మనీల్యాండరింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించారు. వారి నుంచి రూ.12.50 లక్షల విలువైన ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. భారత్‌తో పాటు అమెరికాలోనూ వీరు డ్రగ్స్‌ను విక్రయించారని సందీప్ శాండిల్య తెలిపారు. ఈ ఐదేళ్లలో అమెరికా-ఇండియా-నైజీరియా మధ్య కోట్ల రూపాయల లావాదేవీలు జరిగినట్లుగా పోలీసులు గుర్తించారు. ఎస్కటపీ, ఎండిఎంఏ యూరప్‌లోనే తయారవుతుందని, నెదర్లాండ్, బెల్జియం నుంచి డ్రగ్స్ ఎక్కువగా భారత్‌కు వస్తున్నాయని సందీప్ శాండిల్య చెప్పారు. ఈ క్రమంలో హైదరాబాద్, బెంగళూరు నుంచి అమెరికా సహా ఇతర దేశాలకు డ్రగ్స్ సరఫరా అవుతున్నాయని, ఈ ఆరు నెలల్లో పది పార్సిల్స్‌ను నైజీరియన్ ముఠా విదేశాలకు పంపినట్లు న్యాబ్ గుర్తించిందని సందీప్ శాండిల్య తెలిపారు. దేశంలోనే తొలిసారి డ్రగ్స్ విక్రయాలు, డబ్బుల పంపిణీపై స్పెషల్ ఫోకస్ పెట్టినట్లు యాంటీ నార్కొటిక్స్ బ్యూరో ఎస్పి రూపేష్ తెలిపారు. డ్రగ్ పెడ్లర్లు అమెరికా పోలీసుల నుంచి తప్పించుకునేందుకు నగదును భారత్‌కు బదిలీ చేస్తున్నారని, ఇండియాతో పాటు అమెరికాలో నైజీరియన్లు డ్రగ్స్ సప్లై చేస్తున్నట్లు రూపేశ్ పేర్కొన్నారు.

హైదరాబాద్ అదనపు కలెక్టర్ ముకుందారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీ3 బంగ్లా నిర్వాసితులు

రక్షణ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలి

బొల్లారం, ఏప్రిల్ 5 : ఎలివేటెడ్ కారిడార్ రాజీవ్ రహదారి రోడ్డు విస్తరణలో (జేబీఎస్ నుంచి శామీర్‌పేట)వరకు చేపట్టే ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో ఆస్తులు కోల్పోతున్న బీ3 బంగ్లా నిర్వాసితులకు రక్షణ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని బీ3 బంగ్లా లాండ్ ఓనర్స్ హైదరాబాద్ కలెక్టర్, అదనపు కలెక్టర్ ముకుందారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత మూడు నాలుగు తరాలుగా బీ3 బంగ్లాలో సుమారు 40 నుండి 50 కుటుంబాలు నివసిస్తున్నామని, తాము దిగువ మధ్యతరగతి చెందినవారం కావడంతో ఇంటి స్థలం కొనుగోలు చేసి నిర్మించుకునే పరిస్థితిలో లేమని తెలిపారు. బొల్లారంలో ఎకరం విస్తీర్ణంలో కంటోన్మెంట్ స్థలం ఉందని, రహదారి వెంబడి ఉన్న తమ భూములకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వని యెడల ఆ స్థలంలో ప్లాట్లు చేసి నిర్వాసితులకు కేటాయించాలని కోరారు.

ఈ సమస్యపై ఇప్పటికే నిర్వాసితులు హైకోర్టులో అనేక రిట్ పిటిషన్లు దాఖలు చేశామని ఇప్పటివరకు రక్షణ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించేందుకు ముందుకు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రక్షణ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు స్థలం కొనుగోలు చేసి నిర్మాణానికి పరిహారం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశాల్, శ్రీహరి, శ్రీకాంత్, ప్రమోద్, విశాల్ పాల్గొన్నారు.

పారా త్రోబాల్ క్రీడాకారుడు దీరావత్ మహేశ్‌నాయక్‌ను అభినందిస్తున్న జాగృతి వ్యవస్థాపకురాలు కవిత.

పారా త్రోబాల్ ఏషియన్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు మూడోస్థానం

శామీర్‌పేట, ఏప్రిల్ 5 : పారా క్రీడాకారులను అనునిత్యం ప్రోత్సహిస్తున్నన్న ఎమ్మెల్సీ కవితక్కను ఎన్నడు మరువబోమని పారా త్రోబాల్ భారత్ టీమ్ హెడ్ లింగాపూర్ తండాకు చెందిన దీరావత్ మహేశ్‌నాయక్ అన్నాడు. కాంబోడియాలో మార్చి 28 నుంచి 31 వరకు జరిగిన మొదటి పారా త్రోబాల్ ఏషియన్ చాంపియన్‌షిప్ పోటీల్లో భారతదేశం జట్టు మూడో స్థానంలో నిలిచిందన్నారు. తనలో ఉన్న క్రీడా స్ఫూర్తిని గుర్తించి ఆర్థికంగా ప్రోత్సహించి రూ.89 వేలతో కాంబోడియా వెళ్లేందుకు సహకరించడంతోనే టోర్నీలో భారతదేశానికి నాయకత్వం వహించే అవకాశం లభించిందన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను కవితక్క అభినందించారు.

పెద్దమ్మ గుడిలో సన్ రైజర్స్ ఆటగాళ్లు

బంజారాహిల్స్, ఏప్రిల్ 5: సన్ రైజర్స్ ఆటగాళ్లు అభిషేక్ శర్మ, నితీష్ కుమార్ రెడ్డి శనివారం జూబ్లీహిల్స్ లోని శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి జ్ఞాపిక అందజేశారు. తమ అభిమాన క్రికెటర్లు పెద్దమ్మ గుడికి రావడంతో అభిమానులు సెల్ఫీలకు ఎగబడ్డారు. కాగా సన్ రైజర్స్ జట్టు ఆదివారం ఉప్పల్ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్ తో తలపడనుంది. జట్టు సభ్యులు అభిషేక్ శర్మ నితీష్ కుమార్ రెడ్డి తమ ఫామ్ తిరిగి వచ్చేలా చూడాలంటూ పెద్దమ్మ గుడిలోని అభిమానులు సైతం ఆకాంక్ష వ్యక్తం చేశారు.

20 ఎకరాల్లో బ్రిడ్జ్ ఎప్సిలాన్

సిటీబ్యూరో: తుక్కుగూడలో 20 ఎకరాల్లో బ్రిడ్జ్ ఎప్సిలాన్ విల్లాస్ గ్రీస్ వైభవం ఆధ్వర్యంలో ఆర్కిటెక్చర్ మాస్టర్ పీస్ బ్రిడ్జ్ ఎప్సిలాన్ విల్లాస్ బ్రౌచర్‌ను దర్శకుడు సుకుమార్, వంశీ పైడిపల్లి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రిడ్జ్ గ్రూప్ డైరెక్టర్ ఉజ్వాల్ రావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

ఆ భూములను హెచ్‌సీయూకు అప్పగించాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 5 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని టీజీఐఐసీకి కేటాయించడం అన్యాయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆ భూములను తిరిగి యూనివర్సిటీకే అప్పగించాలని డిమాండ్ చేశారు. డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ (డీఎస్ఏ), డెమోక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ (టీ ఏటీ ఏ) ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, పాశం యాదగిరి, ప్రొఫెసర్లు వినాయక్ రెడ్డి, వెంకటదాసు, లక్ష్మీ నారాయణ తదితరులు హాజరై మాట్లాడారు. యూనివర్సిటీ భూముల పరిరక్షణకు పోరాడుతున్న విద్యార్థులపై కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్న అణచివేత చర్యలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో 369 మంది విద్యార్థుల త్యాగ ఫలితంగా ఏర్పడిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి ఆనాటి ఇందిరాగాంధీ ప్రభుత్వం 2324 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించిందని.. ఆ భూమిని కేవలం విద్యారంగ అభివృద్ధికి మాత్రమే ఉపయోగించాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కంచె చేను మేసినట్లుగా యూనివర్సిటీ భూములను టీజీఐఐసీకి అప్పగించి ఐటీ పరిశ్రమలను అభివృద్ధి చేస్తామని బుకాయిస్తున్నదని మండిపడ్డారు. విద్యారంగ అభివృద్ధికి..భవిష్యత్ తరాల అవసరాలకు యూనివర్సిటీ భూములను కాపాడాల్సిన ప్రభుత్వమే అందుకు విరుద్ధంగా ప్రైవేట్ కంపెనీలకు అప్పజెప్పాలని చూడడం దారుణమన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం 400 ఎకరాల భూములను వెంటనే తిరిగి యూనివర్సిటీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రొఫెసర్ అబ్దుల్ అకీమ్, వివిధ సంఘాల నాయకులు కన్నెకంటి రవి, బాలరాజ్, గణేశ్,ఉపేందర్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

కులగణనంతా కుట్ర పూరితం

కావాలనే మున్నూరుకాపుల సంఖ్య తగ్గించారు

తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ దేవయ్య పటేల్

సమావేశంలో అభివాదం చేస్తున్న మున్నూరు కాపు నాయకులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 5 : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన కుట్రపూరితంగా ఉన్నదని, కావాలనే మున్నూరుకాపులతోపాటు అనేక బీసీ కులాల సంఖ్యను తగ్గించిందని తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ ఆరోపించారు. పటేల్ యూత్ ఫోర్స్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళన సభలో దేవయ్యపటేల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందే మున్నూరుకాపుల జనాభా 40లక్షలకు పైగా ఉందని, గడిచిన పదేండ్లలో అది 50లక్షలకు పైగా పెరిగి ఉంటుందన్నారు. అదే పదేండ్లలో అగ్రకులాల జనాభా పెరిగి బీసీ కులాల జనాభా ఎలా తగ్గుతుందని ప్రశ్నించారు. మున్నూరుకాపులు కేవలం 13 లక్షలు మాత్రమే ఉన్నట్లు తప్పుడు లెక్కలు చూపించారన్నారు. మున్నూరుకాపులకు సముచిత స్థానం కల్పించిన ఏకైక పార్టీ బీఆర్ఎస్సేనని పేర్కొన్నారు. రాష్ట్ర కేబినేట్‌లో మంత్రి పదవులు, ఎమ్మెల్యే, ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్ పదవులు కేటాయించాలన్నారు. కోకాపేటలో కోట్ల విలువైన 5 ఎకరాల భూమిని కేటాయించి ఆత్మగౌరవ భవన నిర్మాణం చేపట్టిందని గుర్తు చేశారు. కనీసం మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను కూడా నిలబెట్టుకోలేని దౌర్భాగ్య పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. రాష్ట్ర చరిత్రలో రెండు బడ్జెట్లలో కేవలం మున్నూరుకాపులకు ఒక్క రూపాయి నిధులు కేటాయించకపోవడం విచారకరమన్నారు. మున్నూరుకాపులను రాజకీయంగా అణచివే సేందుకు ప్రభుత్వం కుట్రకు తెరలేపిందన్నారు.

వచ్చే నెలలో పది లక్షల మందితో సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్‌లో మున్నూరుకాపు గర్జన నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 13న నెక్లెస్‌రోడ్‌లోని జలవిహార్‌లో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నామని, 15న వేములవాడ మున్నూరుకాపు సత్రంలో పోస్టర్ల ఆవిష్కరణ జరుగుతుందన్నారు. అనంతరం పటేల్ గెజిట్, హైదరాబాద్ బాలకబాలికల హాస్టల్, మే నెలలో జరిగే మున్నూరుకాపు గర్జనలో లక్షలాదిగా హాజరుకావాలన్నారు. సభలో మున్నూరుకాపు గర్జన సన్నాహక కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్లు కొత్త లక్ష్మణ్ పటేల్, చందు జనార్దన్ పటేల్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు వేణుగోపాలనాయుడు, మున్నూరుకాపు సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్వీ మహేందర్ కుమార్, మహిళా అధ్యక్షులురాలు బండి పద్మ, సం ఘం భద్రాచలం, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు బాపట్ల మురళీ, పి. అరుణ్ కుమార్, వెంకట్ దాదే, సంధ్యారాణి, శ్రీలత పటేల్, నర్సింగ్ రావు, శ్రీనివాస్ పటేల్, యూత్ ఫోర్స్ కన్వీనర్ తోట సాయిచరణ్, స్పోర్ట్స్ కన్వీనర్ నిఖిల్, ఐటీ కన్వీనర్లు మధు, ప్రణవ్, అఖిల్ పటేల్, అభిషేక్ పాల్గొన్నారు.

బీఈఎల్‌లో ఉద్యోగాలు

మేడ్చల్, ఏప్రిల్ 5 : భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్)లో ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారిణి రాధిక శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీఈఎల్ హైదరాబాద్ యూనిట్లో ఎలక్ట్రానిక్స్ వార్ఫేర్ నావల్ సిస్టమ్స్ (ఈడబ్ల్యూఎస్ఎస్), వార్ఫేర్ ల్యాండ్ సిస్టమ్స్ (ఈడబ్ల్యూఎల్ఎస్)లో శాశ్వత ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ పోస్టులు 8 ఖాళీగా ఉండగా.. ఇందుకు మూడేండ్ల ఈసీఈ డిప్లొమా పూర్తి చేసి ఉండాలన్నారు. అదేవిధంగా 68 పోస్టుల్లో మూడు జనరల్ గా ఉండగా, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, బీసీకి ఒకటి చొప్పున, ఎస్టీకి 2 పోస్టులు రిజర్వు చేసి ఉన్నాయని తెలిపారు. టెక్నీషియన్ పోస్టుకు ఎస్ఎస్ఎల్ఎల్సీ, ఐటీఐ ఎలక్ట్రానిక్స్, మెకానిక్ పూర్తి చేసి ఒక ఏడాది అప్రెంటీస్ చేసిన వారు అర్హులన్నారు. ఈ కేటగిరీలో ఉన్న 21 పోస్టుల్లో జనరల్ 8 ఉండగా ఈడబ్ల్యూఎస్‌కు 3, బీసీలకు 5, ఎస్టీకి 1, ఎస్సీలకు 4 పోస్టులను రిజర్వు చేశారన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు https:/jobapply.inBEL. 2025 HydEATTechMA ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం 040-27194999 నబరులో సంప్రదించాలన్నారు.

సదస్సు ప్రారంభం

ప్రపంచ ఆటిజం అవగాహన మాసంలో భాగంగా రెయిన్బో చ్రిల్డన్స్ హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభించిన హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వైద్యులు ప్రతిమగిరి, జ్యోత్స్న, ప్రసాదరావు, లోకేశ్ లింగప్ప, గౌరీదేవి, మిన్హాజ్, భాస్కర్, నాబాద్ తదితరులు

డ్రంకెన్ డ్రైవ్‌లో 41 మందికి జైలుశిక్ష

సిటీబ్యూరో, ఏప్రిల్5 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ట్రాఫిక్ విభాగం పోలీసులు గత నెల 29 నుంచి ఏప్రిల్ 4 వరకు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 41 మందికి జైలుశిక్ష పడినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ వారం రోజుల్లో పోలీసులు జరిపిన తనిఖీల్లో 1029 మందిపై కేసులు నమోదు కాగా..అందులో 21 నుంచి 40 ఏండ్ల మధ్య ఉన్న వారు 724 మంది ఉన్నారన్నారు. కాగా నలుగురు మహిళలు కూడా మద్యం తాగి వాహనాలు నడిపినట్లుగా పోలీసులు తెలిపారు.

బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో పొందుపరచాలి

తమిళ నాడు రాజ్యసభ సభ్యులు విల్సన్

రవీంద్ర భారతి ఏప్రిల్ 5: భారత రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చితేనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు పరిరక్షణ ఉంటుందని ప్రముఖ రాజ్యాంగ నిపుణులు న్యాయవాది తమిళనాడు రాజ్యసభ సభ్యులు విల్సన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం, ఆల్ ఇండియా బ్యాక్వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్, ఆల్ ఇండియా ఓబీసీ సిస్టూడెంట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సామాజిక న్యాయానికి 42% బీసీ రిజర్వేషన్లు దిక్కూచి అనే అంశంపై శనివారం నాడు హైదరాబాదులోని బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరిగింది. ఈ సదస్సుకు బిసి ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టి. చిరంజీవులు అధ్యక్షత వహించగా ఎంపీ విల్సన్, ఆల్ ఇండియా ఓబీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వంగాల ఈశ్వరయ్య, మాజీ అడ్వకేట్ జనరల్ బిఎస్ ప్రసాద్, ప్రముఖ డాక్టర్ పుంజాల వినయ్ కుమార్, ఓబీసీ లాయర్స్ జేఏసీ చైర్మన్ రాజు, దేవరాజు తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంపీ విల్సన్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ మౌలిక స్వరూపానికి అనుకూలంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చే పాలసీలను చట్టాలను కోర్టులు కొట్టివేయలేవని ఆయన వివరించారు. 1994 సంవత్సరం నుంచే తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చడం వల్లనే ఇది సాధ్యమైందని ఆయన తెలిపారు. తమిళనాడులో సామాజిక న్యాయ ఉద్యమ ఫలితంగా నేడు దేశవ్యాప్తంగా సామాజిక న్యాయానికి తమ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ఛాంపియన్ గా నిలిచారని చెప్పారు. తమిళనాడు రాష్ట్రంలో పెరియార్, అన్నాదురై, కరుణానిధి వంటి మహనీయులు రిజర్వేషన్ల కోసం రోడ్ల మీదకు వచ్చి ఉద్యమాలు చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రిజర్వేషన్లు 50% మించ కూడదన్న కోర్టు తీర్పులను అధిగమించి రిజర్వేషన్లు అమలు చేయడానికి ప్రధాన కారణం ఆనాడు తమిళనాడులోని అన్ని రాజకీయ పక్షాలు ఒకటైనందునే ఇది సాధ్యమైంది అన్నారు. రిజర్వేషన్లను తొమ్మిదవ షెడ్యూలులో చేర్చడం వల్ల ఒక పెద్ద గోడ నిర్మించినట్లు అవుతుందని అందులో ఎవరు జోక్యం చేసుకోవడానికి వీలు ఉండదని వివరించారు. ప్రస్తుతం భారత దేశంలో డీ లిమిటేషన్ చేయడం వల్ల దక్షిణ భారతదేశంలో ఎంపీల సంఖ్య తగ్గి రేపు చట్టాలు తయారు చేయడంలో చాలా నష్టం జరుగుతుందని అన్నారు. ఇప్పుడు జరగబోయే డీలిమిటేషన్ కు వ్యతిరేకంగా మనం ఉద్యమం చేయని పక్షంలో భవిష్యత్తులో ఎవరు దక్షిణాది రాష్ట్రాలను పట్టించుకోకుండానే నిర్ణయాలు జరుగుతాయని దానివల్ల దక్షిణ భారతదేశ ప్రజలు చాలా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జస్టిస్ వంగాల ఈశ్వరయ్య మాట్లాడుతూ గతంలో చట్టం చేయకుండా జీవోలు తెస్తూ వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్లు తెస్తే ఆయా హైకోర్టులు, సుప్రీంకోర్టు కొట్టి వేసిన పలు తీర్పుల వివరాలు చెప్పారు. రాజ్యాంగము, చట్టాల మీద, రిజర్వేషన్ల మీద అవగాహన లేనివారు తమను విమర్శిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అడ్వకేట్ జనరల్ బిఎస్ ప్రసాద్, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టీ చిరంజీవులు, బీసీ ఇంటలెక్చువల్స్ కోర్ కమిటీ సభ్యులు సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు చామకూర రాజు, కె వి గౌడ్, కోల జనార్దన్, వేణు, కొండల గౌడ్, బొమ్మ రఘురాం, ఒంటెద్దు నరేందర్, కిరణ్, వీరస్వామి, శ్రీకాంత్, శీను,ఆళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

ఫార్మా కోసం భూసేకరణ చేయొద్దు

చిక్కడపల్లి, ఏప్రిల్ 5: ఫార్మా కంపెనీల కోసం రైతుల నుంచి భూసేకరణ చేయవద్దని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో శనివారం బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జస్టిస్ చంద్రకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నీటికొరతతో పంటలు ఎండిపోతున్నాయని... తక్షణమే ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసి, సరైన గిట్టుబాటు ధరను కల్పించాలని, పంటలకు బీమా కల్పించి నష్ట పరిహారం చెల్లించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయానికి అధిక మొత్తంలో బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు కల్తీ విత్తనాల పరిశ్రమలపై ఉక్కుపాదం మోపి, వాటి తయారీదారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, రైతుల నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ ఫార్మా కంపెనీల కోసం భూములను సేకరించొద్దని.. ఒకవేళ తప్పనిసరి పరిస్థితిలో సేకరించాల్సి వస్తే భూసేకరణ చట్టం 2013ను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ భూములను తిరిగి యూనివర్సిటీకి అప్పగించాలన్నారు. ఓర్సు ఇంద్రసేనా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, ప్రొఫెసర్ వినాయకరెడ్డి, సరస్వతి, రైతు సంక్షేమ సమితి ప్రధాన కార్యదర్శి ఒంగూరు నరసింహ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్నాటి మల్లేశ్, రాష్ట్ర కార్యదర్శి సోమిడి శ్రీనివాస్,ఏలేశ్వరం వెంకటేశ్ మెడీబావి ప్రభానంద్, వివిధ రైతుసంఘాలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఐఏపీబీ ఆగ్నేయాసియా ప్రాంతీయ అధ్యక్షుడిగా డాక్టర్ రో